క్లుప్తంగా

'మహాభారత యజ్ఞం' ప్రారంభం


పూజలు చేస్తున్న ఇందిరమ్మ

సదుం: మండలంలోని భట్టువారిపల్లె భారతం మిట్ట వద్ద పెద్దిరెడ్డి భాస్కర్‌రెడ్డి ట్రస్ట్ ఆధ్వర్యంలో మహాభారత యజ్ఞం శుక్రవారం ధ్వజారోహణంతో ప్రారంభమైంది. మాజీ ఎంపీపీ పెద్దిరెడ్డి ఇందిరమ్మ, వ్యవసాయ సలహా మండలి జిల్లా సభ్యుడు పెద్దిరెడ్డి సుధీర్‌రెడ్డి పాల్గొన్నారు. 18 రోజుల పాటు మధ్యాహ్నం హరికథా కాలక్షేపం, రాత్రి నాటక ప్రదర్శన ఏర్పాటు చేసినట్టు నిర్వాహకులు తెలిపారు.

నియామకం


నియామక పత్రం ఇస్తున్న ప్రజాప్రతినిధులు

సోమల: మండలంలోని తుడుంవారిపల్లెలో కె.శ్రావణికి అంగన్‌వాడీ కార్యకర్తగా, పెద్ద ఉప్పరపల్లెకి చెందిన ఎస్.ఆఫ్రిన్ హెల్పర్‌గా నియమితులయ్యారు. శుక్రవారం ఎంపీపీ ఈశ్వరయ్య, జెడ్పీటీసీ కుసుమమోహన్, ఏఎంసీ చైర్మన్ అరుణనాగేశ్వరరావు నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు ప్రభాకర్, సయ్యద్‌బాషా పాల్గొన్నారు. .

పాఠశాలల తనిఖీ


టీచర్లతో మాట్లాడుతున్న ఎంఈఓ శివరత్నమ్మ

సోమల: మండంలోని పెద్ద ఉప్పరపల్లె, నంజంపేట, ఇరికిపెంట ప్రాథమిక పాఠశాలలను ఎంఈఓలు శివరత్నమ్మ, శ్రీరాములు తనిఖీ చేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరును పరిశీలించారు. పలు సూచనలు–సలహాలు ఇచ్చారు.

మట్టి నమూనాల పరిశీలన


మట్టి నమూనాలను పరిశీలిస్తున్న అధికారులు

సోమల: మండలంలోని నంజంపేటలో భూసార పరీక్షల కోసం సేకరిస్తున్న మట్టి నమూనాలను ఏడీఏ శివకుమార్ శుక్రవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ, జూన్ నెల మట్టి నమూనాల సేకరణకు అనువుగా ఉంటుందన్నారు. పంటలు సాగు చేయని పొలంలో చెత్తను తొలగించి 'టి' అక్షర ఆకారంలో మట్టిని తవ్వి సేకరించాలన్నారు. సేకరించిన మట్టిని పరీక్ష కేంద్రాలకు పంపి, ఫలితాలను రైతులకు తెలియజేస్తామన్నారు. కార్యక్రమంలో ఏఓ సుధాకర్, ఆర్‌బీకే అధికారి రాధిక పాల్గొన్నారు.

కళాశాల అభివృద్ధికి చర్యలు

సదుం: స్థానిక ఎంజేపీ గురుకుల పాఠశాలను జోనల్ ఆఫీసర్ రాజేంద్రనాథరెడ్డి శుక్రవారం పరిశీలించారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చొరవతో జూనియర్ కళాశాల మంజూరు అయ్యిందని, కళాశాల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని ప్రిన్సిపల్ శ్రీనివాస్‌రెడ్డికి సూచించారు. పలు అంశాలపై సిబ్బందితో ఆయన చర్చించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, ఎంజేపీ అన్నమయ్య జిల్లా కన్వీనర్ సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మకు అభిషేక పూజలు


విశేషాలంకరణలో గంగమ్మ

చౌడేపల్లె: బోయకొండ గంగమ్మ ఆలయంలో శుక్రవారం భక్తిశ్రద్ధలతో రాహుకాల అభిషేకపూజలు నిర్వహించారు. ఉదయాన్నే ఆలయ అర్చకులు అమ్మవారి గర్భాలయాన్ని శుద్ధి చేశారు. రాహుకాల సమయం 10–30 గంటలనుంచి 12 గంటల వరకుఅర్చనలు, అభిషేక పూజల అనంతరం ప్రత్యేకంగా బంగారు నగలు, పుష్పాలతో అమ్మవారిని అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఈఓ చంద్రమౌళి ఆధ్వర్యంలో తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

పరిహారం పంపిణీ

కుప్పం: కుప్పం మున్సిపల్ పరిధిలోని తంబిగానిపల్లెలో అంత్యక్రియల సందర్భంగా జరిగిన విద్యుదాఘాతంలో మృతి చెందిన ముగ్గురు బాధిత కుటుంబాలకు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి రూ.15 లక్షల పరిహారం అందజేశారు. తంబిగానిపల్లె కొట్టాలుకు చెందిన రవిచంద్రన్, తిరుపతి, మునెప్ప కుటుంబ సభ్యులకు బెగ్గిలిపల్లె సభలో ఒక్కొక్కరికి రూ.5 లక్షల చొప్పున చెక్కులను పంపిణీ చేశారు. జెడ్పీ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్సీలు భరత్, సిపాయి సుబ్రమణ్యం, టీటీ డీ బోర్డు సభ్యుడు పోకల అశోక్‌కుమార్, వన్నెకుల క్షత్రియ చైర్మన్ వనిత, రెస్కో చైర్మన్ సెంథిల్‌కుమార్, మున్సిపల్ చైర్మన్ సుధీర్ పాల్గొన్నారు.


కుప్పంలో వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేస్తాం

- జగనన్న పాలన చూసి మార్పు మొదలు
- అందుబాటులో ఉన్న భరత్‌ను ఆదరించండి
- మోసగాడు బాబును నమ్మొద్దు
- వైఎస్సార్ సీపీతోనే కుప్పం అభివృద్ధి సాధ్యం
- జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎంపీ రెడ్డెప్ప


పల్లెబాట కార్యక్రమంలో ప్రజలకు అభివాదం చేస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

కుప్పం/గుడుపల్లె: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో కుప్పంలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేసి తీరుతామని జిల్లా పరిషత్ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు ధీమా వ్యక్తంచేశారు. శుక్రవారం రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చేపట్టిన పల్లెబాట కార్యక్రమంలో భాగంగా గుడుపల్లె మండలంలో ఏర్పాటుచేసిన సభల్లో ఆయన మాట్లాడారు. ఏళ్ల తరబడిగా తిష్టవేసిన బాబు మాటలు విని కుప్పం ప్రజలు విసిగిపోయారని, జగన్‌మోహన్‌రెడ్డి పాలన చూసి ఇక్కడి ప్రజల్లో మార్పు మొదలైందన్నారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ జెండా ఎగరడం ఖాయమన్నారు. ఎంపీ రెడ్డెప్ప మాట్లాడుతూ, బాబు మోసగాడని, అతన్ని నమ్మొద్దని ప్రజలకు పిలుపునిచ్చారు. ఏడాదికి ఓమారు వచ్చే చంద్రబాబును నమ్మి ఇన్ని రోజులు మోసపోయారని, ఇప్పటికైనా మేల్కొని అందుబాటులో ఉండే భరత్‌ను గెలిపించుకోవాలని సూచించారు. జగన్‌మోహన్‌రెడ్డి చెప్పిన మాట ప్రకారం ఇచ్చిన హామీలను నెరవేర్చడమే ఆయన నైజమన్నారు. కుప్పంను పులివెందుల తరహాలో అభివృద్ధి చేస్తామని చెప్పారని, అందుకు ఆయన కట్టుబడి ఉన్నారని గుర్తుచేశారు. టీటీడీ బోర్డు సభ్యుడు పోకల అశోక్‌కుమార్ మాట్లాడుతూ, 25 వేల మంది బలిజ కులస్తులు ఉన్న కుప్పం నియోజకవర్గంలో చంద్రబాబు వారి కష్టాలను పట్టించుకున్న పాపాన పోలేదని విమర్శించారు. కోర్టు వివాదంలో ఉన్న స్థలాన్ని బలిజ కమ్యూనిటీ భవనానికి కేటాయించి మోసం చేశారని పేర్కొన్నారు. ఈ వివాదాన్ని మంత్రి సహకారంతో పరిష్కరించి బలిజ భవన్ నిర్మాణానికి కృషి చేసిన విషయం అందరికీ తెలిసిందేనన్నారు. భరత్ మంత్రి అయితే కుప్పం సమస్యలు పూర్తిగా తీరుతాయన్నారు. ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం మాట్లాడుతూ వన్నెకుల క్షత్రియ సామాజికవర్గం అధికంగా ఉన్న కుప్పం నియోజకవర్గంలో బాబు పోటీయడం తగదన్నారు. ముఖ్యమంత్రి ఈ సామాజికవర్గానికి అధిక ప్రాధాన్యత కల్పించారని చెప్పారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాకు ఇద్దరు ఎమ్మెల్సీలను కేటాయించారని గుర్తుచేశారు. ఎమ్మెల్సీ భరత్ మాట్లాడుతూ, తండ్రి చనిపోయిన తనకు రాజకీయ అనుభవం లేకున్నా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రి పెద్దిరెడ్డి కలిసి పార్టీలో అధిక ప్రాధాన్యత కల్పించడం మరువలేనన్నారు. వీరి నమ్మకాన్ని నిలబెడుతూ, కుప్పం ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని చెప్పారు. ఈ ప్రాంత ప్రజల సమస్య పరిష్కారానికి శక్తివంచన లేకుండా కృషిచేస్తున్నట్లు చెప్పారు.


మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు



మాట్లాడుతున్న ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్సీ భరత్



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, టీటీడీ బోర్డు సభ్యుడు పోకల అశోక్‌కుమార్

స్వయం ఉపాధికి ఉచిత శిక్షణ

పుంగనూరు: పట్టణంలోని ఐటీఐ కళాశాలలో స్వయం ఉపాధి కల్పన కోసం వివిధ కోర్సులలో ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ, ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజన పథకం కింద వివిధ కోర్సులలో 15 నుంచి 45 ఏళ్లలోపు కలిగిన యువతీ యువకులు శిక్షణ ఇస్తామన్నారు. ఫిట్టర్, ఫ్యాబ్రికేషన్, ఎలక్ట్రీషియన్, కుట్టుపని, సర్వేయర్, వెల్డర్..శిక్షణ కాలం మూడు నెలలు ఉంటుందని తెలిపారు. శిక్షణ కాలంలో ఒకొక్కరికి రూ.1000 స్టైఫండ్ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల నిరుద్యోగ యువత కళాశాలలో సంప్రదించాలని కోరారు.

ఐటీఐ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

శాంతిపురం: ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజన పథకం కింద ఐటీఐలో ప్రవేశపెట్టిన కోర్సులపై ఆసక్తి ఉన్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ నగేష్ కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఎలక్ట్రిక్ వెహికల్ సర్వీస్ టెక్నీషియన్, ఫిట్టర్ ఫ్యాబ్రికేషన్ కోర్సులు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. 45 ఏళ్లలోపు వయసు ఉండి పదో తరగతి ఉత్తీర్ణులైన వారు, ఐటీఐ కోర్సులను అసంపూర్తిగా వదిలేసిన వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ నెల 30వ తేదీలోగా స్టడీ సర్టిఫికెట్లు, ఆధార్, బ్యాంకు పాస్ బుక్, రెండు పాస్ పోర్టు సైజు ఫొటోలతో నేరుగా తమ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

వైభవంగా ఎల్లమ్మ తిరునాళ్ల

సదుం: మండలంలోని జోగివారిపల్లెలో సుందుపల్లె ఎల్లమ్మ తిరునాళ్లను శుక్రవారం గ్రామస్తులు వైభవంగా నిర్వహించారు. మహిళలు బోనాలను ఊరేగింపుగా తీసుకువచ్చి అమ్మవారికి సమర్పించారు. భక్తులు మొక్కులు చెల్లించారు.

మంత్రికి విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల వినతి


మంత్రి పెద్దిరెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎంఈఓలు తిరుమలమ్మ, కేశవరెడ్డి తదితరులు

కుప్పంరూరల్: తమ సమస్యలను పరిష్కరించాలంటూ విద్యుత్ కాంట్రాక్టు కార్మికులు విద్యుత్‌శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి శుక్రవారం వినతి పత్రం సమర్పించారు. గుడుపల్లె మండలం, బెగ్గిలిపల్లికి వచ్చిన మంత్రిని కలిసి తమ సమస్యలను చెప్పుకున్నారు. థర్డ్ పార్టీ విధానాన్ని రద్దు చేయాలని, 2022 పీఆర్సీతో కలిపి డీఏ, ఇంక్రిమెంట్లు, హెల్త్ కార్డులు, గ్రాట్యూటీ తదితర సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. సీఎం దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని మంత్రి తెలిపారు. కార్మిక నాయకులు హేమకుమార్, అఖిలాష్, ఆనంద్‌బాబు, మనీష్‌కుమార్, రజిని, అనీల్, భాస్కర్, అరవింద్, సతీష్, ఇమ్రాన్ తదితరులు ఉన్నారు.

మంత్రిని కలిసిన ఎంఈఓలు

చౌడేపల్లె: ఎంఈఓ–2 గా బాధ్యతలు స్వీకరించిన ఆర్‌సి.తిరుమలమ్మ, ఎంఈఓ కేశవరెడ్డితోపాటు ఉపాధ్యాయులు శుక్రవారం తిరుపతిలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. మండలంలో జరుగుతున్న నాడు–నేడు పనులు, విద్యా ప్రగతి గురించి మంత్రి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జగన్‌మోహన్‌రెడ్డి, హరిబాబు, పీఎంసీ కమిటీ చైర్మన్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి పెద్దిరెడ్డికి ఘన స్వాగతం

రామకుప్పం: గుడుపల్లె మండల పర్యటన సందర్భంగా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి రాజుపేట రోడ్డు వద్ద వైఎస్సార్‌సీపీ రామకుప్పం మండల నేతలు ఘన స్వాగతం పలికారు. జెడ్పీటీసీ సభ్యుడు నితిన్‌రెడ్డి, మండల కన్వీనర్ బాబురెడ్డి, చంద్రారెడ్డి, అప్పి, కేశవరెడ్డి ఉన్నారు.

26 నుంచి గడప గడపకు మన ప్రభుత్వం


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ యువరాజు

వి.కోట: మండలంలో 26వ తేదీ నుంచి నాలుగు రోజుల పాటూ గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీపీ యువరాజు సూచించారు. మండలంలోని యాలకల్లూర్ సచివాలయంలో శుక్రవారం సచివాలయ ఉద్యోగులు, ప్రజాప్రతినిధులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే వెంకటేగౌడ సోమవారం నుంచి నాలుగు రోజుల పాటు మండలంలో పర్యటించనున్నట్లు వివరించారు. దీనికి పంచాయతీ అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లు, ప్రజాప్రతినిధులు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

మూడు నెలల్లో పనులు పూర్తి చేయండి

మండలంలో నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ భవనాల పనులను మూడు నెలల్లో పూర్తి చేయాలని ప్రభుత్వ భవనాల కాంట్రాక్టర్లకు ఎంపీపీ యువరాజు సూచించారు. ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం కాంట్రాక్టర్లతో నిర్వహించిన సమావేశంలో కార్యక్రమంలో పీఆర్ఏఈ శ్రీనివాసులు, జీజేసీ చైర్మన్ అమరనాథ్, వైస్ ఎంపీపీ లక్ష్మణ్, సింగిల్ విండో చైర్మన్ శ్రీరాములు పాల్గొన్నారు.

నూతన ఎంపీడీఓ తాజ్‌మస్రూర్‌కు సత్కారం


ఎంపీడీఓను సత్కరిస్తున్న నేతలు

గంగవరం: నూతన ఎంపీడీఓ తాజ్‌మస్రూర్‌ని మండల సర్పంచుల సంఘం, వైఎస్సార్ సీపీ నేతలు శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా సన్మానించారు. ఎంపీపీ వెంకటరమణ, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు గిరిరాజారెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ ప్రహ్లాద, సర్పంచులు భాస్కర్‌రెడ్డి, రమణ, బీరుగౌడు, నాయకులు చంద్రప్ప తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతుల ప్రదానం

బైరెడ్డిపల్లె : మండలంలోని వెంగంవారిపల్లె ప్రాథమిక పాఠశాల విద్యార్థులు ఏపీ మోడల్ స్కూల్‌కు 8 మంది ఎంపిక కావడంతో వారికి బహుమతులు అందజేశారు. సర్పంచ్ రవిచంద్రబాబు మాట్లాడుతూ ఉపాధ్యాయుల కృషితో విద్యార్థులు చక్కగా చదివి పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి ఎంపికైనందుకు ప్రోత్సాహక బహుమతులు అందజేసినట్లు వివరించారు. హెచ్ఎం శశికుమార్, ఉపాధ్యాయులు ఝాన్సీరాణి, నాగరాణి, రవి పాల్గొన్నారు.

అన్నదానం


భోజనాన్ని అందిస్తున్న మోహన్

పలమనేరు: పట్టణానికి చెందిన కూలి పనులకెళ్లే వాళ్లు, దినసరి కార్మికులకు ఓ పూట భోజనం పెట్టాలనే తలంపుతో స్థానిక సంఘ సేవకుడు మోహన్ శుక్రవారం ఓ పూట భోజనాన్ని అందించారు. ఇకపై వారంలో రెండు రోజులు పేదలకు అన్నదానం చేయనున్నట్లు తెలిపారు.

ఉపాధ్యాయులకు సన్మానం


టీచర్లను సన్మానిస్తున్న హెచ్ఎం నాగమల్లిక


సదుం: వలంటీర్లను సన్మానిస్తున్న నాయకులు

చౌడేపల్లె: మండలంలోని మేకలచిన్నేపల్లె ఉన్నత పాఠశాలలో పనిచేస్తూ బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు వీరభద్రయ్య, శ్రీనివాసులు, దామోదరంను శుక్రవారం హెచ్ఎం నాగమల్లిక ఆధ్వర్యంలో సన్మానించారు. తల్లిదండ్రుల సమావేశం ఏర్పాటు చేసి ఈ కార్యక్రమం నిర్వహించారు. టెన్త్ పబ్లిక్ పరీక్ష ఫలితాల్లో 100 శాతం ఫలితాలు రావడానికి ఉపాధ్యాయుల కృషి మరువలేనదని హెచ్ఎం వారి సేవలను కొనియాడారు. వారిని సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. ఉపాధ్యాయులు లింగయ్య, మృదుల, మోహన్, విజయశ్రీ, పురుషోత్తం, గోవిందు, మనోహరరాణి, సుధాకర్ నాయుడు పాల్గొన్నారు.

వలంటీర్లకు..

సదుం: వలంటీర్ల సేవలు అభినందనీయమని ఊటుపల్లె, చింతలవారిపల్లె సర్పంచులు శ్రీనివాసుల రెడ్డి, రెడ్డెమ్మ తెలిపారు. ఊటుపల్లె సచివాలయంలో రెండు పంచాయతీల వలంటీర్లను శుక్రవారం సత్కరించారు. వారి సేవలను ప్రస్తుతించారు.

ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు


గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంకటేగౌడ

గంగవరం: రాష్ట్రంలో సంక్షేమ ఫలాలను ఇంటింటికీ అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదే అని ఎమ్మెల్యే వెంకటేగౌడ స్పష్టం చేశారు. ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శుక్రవారం మండలంలోని పత్తికొండ గ్రామంలో నిర్వహించారు. నాలుగేళ్లలో సంక్షేమ పథకాల ద్వారా చేకూరిన లబ్ధి వివరాలతో కూడిన సంక్షేమ బావుటా బుక్‌లెట్‌ను ఇంటింటికీ అందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సంక్షేమ పథకాలు వంద శాతం అమలు, పారదర్శక పాలన, అభివృద్ధిలో ఏపీని దేశంలోనే ప్రథమ స్థానంలోకి తీసుకొచ్చిన ఘనత సీఎంకే దక్కుతుందన్నారు. జగనన్న సురక్ష ప్రారంభోత్సవం అనంతరం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సందేశాన్ని ఎమ్మెల్యే, అధికారులు, నాయకులతో కలిసి సచివాలయంలో వీడి యో ద్వారా వీక్షించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ హేమంత్‌కుమార్‌రెడ్డి, మండల పార్టీ కన్వీనర్ మోహన్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ ప్రహ్లాద, ఎంపీపీ వెంకటరమణ, సర్పంచ్ రవి నాయుడు, ఎంపీటీసీ సూరిబాబు, నాయకులు చంద్రప్ప, శ్రీరాములురెడ్డి, గిరిరాజారెడ్డి, రాధాక్రిష్ణ, సిద్ధప్ప, పలు శాఖల అధికారులు, సచివాలయ ఉద్యోగులు, గ్రామ వలంటీర్లు, పాల్గొన్నారు.

సోషల్ మీడియా సభ్యులతో సమావేశం

నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా సభ్యులు దాదాపు 40 మందితో ఎమ్మెల్యే వెంకటేగౌడ సమావేశమయ్యారు. ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని పార్టీ గెలుపే లక్ష్యంగా ప్రతి సైనికుల్లా పని చేయాలని సూచించారు. సోషల్‌మీడియా నియోజకవర్గ ఇన్‌చార్జి ఉదయ్‌కుమార్, కో–కన్వీనర్లు అమర్‌నాథరెడ్డి, మనోహర్, రఘునాథరెడ్డి, కిరణ్‌కుమార్, మండలాల కన్వీనర్‌లు, కో– కన్వీనర్లు పాల్గొన్నారు.

నేడు చలమంగళంలో..

పెద్దపంజాణి: మండలంలోని చలమంగళం గ్రామ పంచాయతీలో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ బాగా రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

నియామక పత్రాల అందజేత


నియామకపత్రాలు అందిస్తున్న ఎమ్మెల్సీ భరత్

కుప్పంరూరల్: అంగన్‌వాడీ కార్యకర్తలు సేవాభావంతో పని చేయాలని చిత్తూరు ఎమ్మెల్సీ భరత్ అన్నారు. మే 27న నిర్వహించిన ఇంటర్వ్యూల్లో ఎంపికైన అంగన్‌వాడీ కార్యకర్త, మిని వర్కర్, ఆయాలకు శుక్రవారం నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భావితరాలు బలంగా ఉండాలని అంగన్‌వాడీల ద్వారా పౌష్టికాహారం పంపిణీ చేస్తున్నారని, సక్రమంగా అందేలా చూడాల్సిన బాధ్యత అంగన్‌వాడీ కార్యకర్తలపై ఉందన్నారు. కార్యక్రమంలో సీడీపీఓ అరుణశ్రీ, ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.

యోగాలో జ్ఞాన కుష్మిత ప్రతిభ



బైరెడ్డిపల్లె: అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు శుక్రవారం చిత్తూరులో నిర్వహించిన కార్యక్రమంలో కమ్మనపల్లె గురుకుల పాఠశాలలో 8వతరగతి చదువుతున్న జ్ఞాన కుష్మిత యోగాలో ప్రతిభ కనబరచడంతో పీఏ వెంకటరామిరెడ్డి ప్రోత్సాహక బహుతులు అందజేశారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని చెరకువారిపల్లె సమీపంలో హంద్రీ–నీవా కాలువ వద్ద 9మంది పేకాటరాయుళ్లను శుక్రవారం అరెస్టు చేసినట్లు కల్లూరు పోలీసులు తెలిపారు. వారి నుంచి రూ.40,030 స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

పటిష్టంగా 'జగనన్న సురక్ష'


సీఎం సందేశాన్ని వింటున్న ఎంపీపీ భాస్కర్‌రెడ్డి, ఎంపీడీఓ నారాయణ


పెద్దపంజాణి: సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యురాలు సుష్మకీర్తి

పుంగనూరు: జగనన్న సురక్ష పథకాన్ని ప్రతి గ్రామంలో పటిష్టంగా నిర్వహించి, సమస్యలను గుర్తించి, పరిష్కరించాలని ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి మండల అధికారులను ఆదేశించారు. శుక్రవారం ముఖ్యమంత్రి ప్రారంభించిన జగనన్న సురక్ష పథకాన్ని అధికారులతో కలసి వీక్షించారు. అలాగే మున్సిపాలిటిలోని 12వ వార్డులో మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా జగనన్న సురక్ష పథకాన్ని ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం నిర్దేశించిన షెడ్యూల్డ్ మేరకు ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని కోరారు. సమావేశంలో ఎంపీడీఓ నారాయణ, వ్యవసాయాధికారిణి రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

రొంపిచెర్లలో..

రొంపిచెర్ల: స్థానిక గ్రామ సచివాలయంలో ఉద్యోగులకు, వలంటీర్లకు సర్పంచ్ ఇబ్రహీంఖాన్ అవగాహన కల్పించారు. రొంపిచెర్ల–1 గ్రామ సచివాలయంలో జూలై12న, రొంపిచెర్ల–2 గ్రామ సచివాలయంలో జూలై 14న జగనన్న సురక్షకు సంబంధించి ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తామని, దీనిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యదర్శులు నాగరాజ, రవిచంద్రబాబు, హౌసింగ్ ఏఈ యోగానంద్ తదితరులు పాల్గొన్నారు.

సదుంలో..

సదుం: జగనన్న సురక్ష పథకం ప్రారంభోత్సవం, అమలుపై తాడేపల్లె నుంచి సీఎం చేసిన ప్రసంగాన్ని అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు సచివాయాలలో వీక్షించారు.

సద్వినియోగం చేసుకోండి

పెద్దపంజాణి: జగనన్న సురక్ష పథకాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ సభ్యురాలు సుష్మకీర్తి అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన జగనన్న సురక్ష పథకం ప్రారంభోత్సవంలో ఆమె పాల్గొని ప్రసంగించారు. సీఎం జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ కార్యక్రమాలు దేశానికే ఆదర్శమన్నారు. ఎంపీడీఓ శ్రీనివాస విశ్వనాథ్ మాట్లాడుతూ జూన్ 24 నుంచి వలంటీర్లు గడప గడపకు తిరిగి ప్రజా సమస్యలను గజనన్న సురక్ష యాప్‌లో నమోదు చేస్తారన్నారు. అనంతరం సంబంధిత అధికారులు వాటిని పరిశీలించి పత్రాలు అందజేస్తారని పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బాగా రెడ్డి, సింగల్ విండో చైర్మన్ సంపల్లి, బాబు రెడ్డి, వైస్ ఎంపీపీ జీడీ బాబు, ఇన్‌చార్జి తహసీల్దార్ ఫణికుమార్ పాల్గొన్నారు.

సోమలలో..


మాట్లాడుతున్న ఏఎంసీ చైర్మన్ అమాస మోహన్

సోమల: మండలంలోని పెద్ద ఉప్పరపల్లె, 81 చిన్న ఉప్పరపల్లె, అన్నెమ్మగారిపల్లె సచివాలయాలలో శుక్రవారం జగనన్న సురక్ష పథకంపై సచివాలయాల సిబ్బంది, వలంటీర్లకు ఎంపీపీ ఈశ్వరయ్య, ఏఎంసీ మాజీ చైర్మన్ అమాస మోహన్, జేసీఎస్ మండల కన్వీనర్ రాశెట్టి మధు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ నాగేశ్వరరావు, పార్టీ మండల అధ్యక్షుడు గంగాధరం, వైస్ ఎంపీపీలు ప్రభాకర, సయ్యద్‌బాషా, ఎంపీటీసీలు సర్వేశ్వరి, రజియా, సరస్వతమ్మ, సర్పంచ్‌లు భారతి, శీలం సిద్ధులమ్మ, వనజమ్మ పాల్గొన్నారు.

అంటువ్యాధులపై అవగాహన ర్యాలీ


అవగాహన ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

రామకుప్పం: మండలంలోని విజలాపురం పీహెచ్‌సీ పరిధిలో డాక్టర్ అల్తాఫ్ హుస్సేన్ ఆధ్వర్యంలో శుక్రవారం అంటువ్యాధులపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాకాలంలో దోమల ద్వారా వచ్చే వ్యాధుల గురించి ప్రజల అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రధానంగా డెంగీ, మలేరియా, గున్యా వ్యాధుల భారిన పడకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలని సూచించారు.

బాటగంగమ్మకు విశేష పూజలు

బైరెడ్డిపల్లె: బైరెడ్డిపల్లె బాట గంగమ్మ ఆలయంలో ఆషాడ శుక్రవారం సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేపట్టి వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు నాగేంద్రస్వామి భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.